# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం, కేసుల పరిష్కారమవుతాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో తెలుగు వారంతా సురక్షితంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సూచించారు.**

3. **రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.**

4. **ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

==========================

అమరావతిలో జాతీయ జ్యుడిషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారత దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నేతృత్వంలో విజయవాడలో మధ్యవర్తిత్వంపై నిన్న రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం, కేసులు పరిష్కారమవుతాయని చెప్పారు. రాజధాని అమరావతిలో జస్టిస్ సిటీ సహా న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో తెలుగు వారంతా సురక్షితంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సూచించారు. వారంతా అప్రమత్తంగా ఉండాలని, ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, భద్రతా మార్గదర్శకాలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎవరూ బయటకు రావద్దని చెప్పారు. తెలుగువారిని రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం సమన్వయం చేసుకుంటుందని వివరించారు. ఇరాన్, గల్ఫ్ దేశాల్లోని.. రాష్ట్ర ప్రజల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని తెలిపారు.

---------------------------

ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆంధ్రప్రదేశ్ ఎన్.ఆర్.ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సంయమనం పాటించాలని, త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని ఈ మేరకు ప్రకటనలో తెలిపారు. ఆయా దేశాల్లో ఉన్న రాష్ట్ర పౌరులు అందరూ భారత రాయబార కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. మరింత సమాచారం కోసం 8500027678, 0863 2340678 హెల్ప్ లైన్ నెంబర్లను apnrts.ap.gov.in వెబ్ సైట్ ను సంప్రదించాలని మంత్రి విజ్ఞప్తి చేసారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలను మంత్రులు పి.నారాయణ, వి. అనిత నిన్న పరామర్శించారు. ఈ సందర్భంగా పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పి.నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

మహారాష్ట్ర ముంబైలోని గ్రాండ్ హయత్‌లో నిర్వహించిన ఇండియన్ సూపర్ గేమింగ్ లీగ్ –×ూ+ూ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ క్రీడా రంగంలో రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాల గురించి ఆయన వివరించారు. యువత ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడా రంగాన్ని డిజిటల్ దిశగా విస్తరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో ఈ–స్పోర్ట్స్ అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. లీగ్ ఫైనల్స్ ను విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈరోజు గణితం పరీక్ష జరుగుతుంది.

తెలంగాణాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈరోజు గణితం, వృక్షశాస్త్రం, రాజకీయ శాస్త్రం పరీక్షలు జరుగుతున్నాయి.

---------------------------

రైతులు ధాన్యం అమ్మిన 24గంటల్లోనే, నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సంగంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండించిన ధాన్యానికి తగిన గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని చెప్పారు. దళారులు అత్యధిక

ధరలు ఇస్తామంటే నమ్మి మోసపోవద్దు అని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని మంత్రి సూచిస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని కేంద్ర హెం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం విజయనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇటీవల ఏకగ్రీవమైన విజయనగర్ కాలనీ బిజెపి గ్రామ సర్పంచ్‌కు 10 లక్షల రూపాయాల నిధుల చెక్కును అందించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ, ఎంపీ నిధుల కింద వచ్చే 5 కోట్ల రూపాయలతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 5 జిల్లాల్లో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని బండి సంజయ్ తెలిపారు.

---------------------------

ఐసీసీ టీ-20 ప్రపంచ కప్ సూపర్-8లో భాగంగా వెస్టిండీస్, భారత్ జట్ల మధ్య కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన క్రికెట్ మ్యాచ్లో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది.

అనంతరం భారతజట్టు 19.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసి వరల్డ్ కప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు సెమీ ఫైనల్స్ కు చేరుకోగా.. ఈ నెల 5వ తేదీన ముంబై వాంఖడే మైదానంలో జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానం దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడురోజులపాటు పొడి వాతావరణం కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరిగే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణాలోనూ రానున్న మూడురోజులపాటు పొడి వాతావరణం కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్ని ప్రమాద ఘటనపై స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆసుపత్రిలో అందరూ క్షేమంగా ఉన్నారని, ఎవరికి ఎటువంటి హాని జరగలేదని స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని ఎంసిహెచ్ బ్లాక్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని ఇందులో రెండు పడకలు మాత్రమే కాలిపోయాయని తెలిపారు. ఇందులో ఎవరికి కూడా ఎలాంటి గాయాలు కాలేదని, మరణాలు సంభవించలేదని చెప్పారు. భద్రతా సిబ్బంది అందరూ అప్రమత్తంగా వ్యవహరించి రోగులను సురక్షితంగా బయటకు తరలించారని చెప్పారు.

=====================